Crime Mirror QR Code
https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
9-12-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 26

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# ఇక నిలదీయడమే!

- బీఆర్ఎస్ శాసనసభ పక్ష భేటీలో కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చాం
- పాలకుల అసమర్థతపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు
- హామీలు నెరవేర్చడం చేతకాక అణచివేత విధానాలు
- నాపై కక్షతోనే తెలంగాణ తల్లి విగ్రహం రూపు మారుస్తున్నారు
- గురుకుల విద్యా సంస్థల్లో సమస్యలపై త్వరలో కార్యాచరణ
- వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరులో భారీ బహిరంగ సభ



2లో

హైదరాబాద్: పాలకుల అసమర్థతపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ ఎస్.. ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి తగినంత సమ యం ఇచ్చామని, సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై గొంతు విప్పాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాక ప్రభుత్వం కొనసాగిస్తున్న అణచివేత విధానాలను ఎండగట్టాలని చెప్పారు. ఆదివారం ఎర్రవల్లి నివాసంలో జరిగిన బీఆర్ఎస్ శాసనసభా పక్షం సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన ఈ భేటీలో పలు అంశాలను ప్రస్తావించారు. 'త్యాగాలు చేసి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేయాలని కాంగ్రెస్ చూస్తోంది. నమ్మి ఓట్లు వేసిన రైతులు, గిరిజనులు, దళితులను వేధిస్తోంది. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల మీద కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తోంది.

---



# శీతాకాల సమరం

- ఏడాది పాలన ఫలితాలను ప్రజల ముందుంచే యత్నం చేయనున్న అధికార పార్టీ
- ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ
- హామీలపై నిలదీయాలని బీఆర్ఎస్ఎల్పీ భేటీలో కేసీఆర్ దిశానిర్దేశం
- ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండాగా కమల దళం సిద్ధం
- హైదరాబాద్ అభివృద్ధిపై చర్చ కోరనున్న మజ్లిస్
- మహిళా యూనివర్సిటీ, బాసర ట్రిపుల్ఐటీ బిల్లులపైనా చర్చ
- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై ప్రకటన చేయనున్న సీఎం రేవంత్
- సమావేశాల ఎజెండాపై నేడు అసెంబ్లీ, మండలి బీఏసీల భేటీ

2లో



# తెలంగాణ తల్లి పండుగ

- నేడు అసెంబ్లీలో ప్రకటించనున్న సీఎం రేవంత్
- విగ్రహం ఆవిష్కరణకు ముందే ఉత్తర్వులు
- నేటి నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు
- ఆర్ఓఆర్-2024 చట్టంపైనే ప్రధానంగా చర్చ!
- రైతు భరోసా పథకం విధివిధానాలపై కూడా
- పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లుకు ఆమోదం!
- మూసీ, హైడ్రా ప్రస్తావనకు వచ్చే అవకాశం
- వారంపాటు సమావేశాలు.. వాడీవేడి ఖాయం

హైదరాబాద్: రాష్ట్ర సచివాలయంలో సోమవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేపథ్యంలో ఇకపై ఏటా డిసెంబరు 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఉత్సవం సందర్భంగా రాష్ట్ర గీతం 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' ఆలాపన జరగనుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం శాసనసభలో ప్రకటన చేయనున్నారు.

# మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా నర్వేకర్

- ఏకగ్రీవం కానున్న బీజేపీ నేత ఎన్నిక
- డిప్యూటీ స్పీకర్ పదవిని తమకివ్వాలంటున్న ఎంవీఏ



# టీ-బిస్కెట్లిచ్చి.. పూలు జల్లి..

- ఆపై బాష్ప వాయు గోళాలు, జల ఫిరంగులతో దాడి చేసి..
- రైతుల ఆందోళనలో హర్యానా పోలీసుల డ్రామా
- చలో ఢిల్లీ పాదయాత్ర చేపట్టిన అన్నదాతలపై దాష్టీకం
- పలువురికి గాయాలు.. తాత్కాలికంగా యాత్ర నిలిపివేత

---

# మంచు ఫ్యామిలీలో ఆస్తుల మంటలు?

## మోహన్‌బాబు, మనోజ్ ఘర్షణ?

- గాయాలతో దవాఖానలో చేరిన మనోజ్
- పోలీసులకు తండ్రీకొడుకుల పరస్పర ఫిర్యాదు
- అంతర్గతంగా చర్చించుకుంటా మని తర్వాత వెల్లడి
- ఆస్తుల వివాదంలోనే గొడవ?




2లో

# ఏడాది పాలన.. ఎడతెగని వంచన

- సీఎం రేవంత్ అజ్ఞానంతో దేశం ముందు రాష్ట్రం నవ్వులపాలు
- మూసీ ప్రక్షాళన పేరిట మూటలు వెనకేసుకునే ప్రయత్నాలు
- పెరిగిపోయిన రాజకీయ కక్ష సాధింపు చర్యలు
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు.. కాంగ్రెస్ ఏడాది పాలనపై చార్జిషీట్

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలున ఎడతెగని వేదనను మిగిల్చిదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. కాయిగ్రెస్ పాలన అంతా పరపీడన పరాయణత్వంలా మారిందని విమర్శించారు. భావ ప్రకటనా స్వేచ్ఛును కాపాడుతామని అధికారంలోకి వచ్చి..



2లో



# టీ-బిస్కెట్లిచ్చి.. పూలు జల్లి..

న్యూఢిల్లీ: తమ డిమాండ్ల సాధనకు రైతులు ఆదివారం ఢిల్లీకి కొనసాగించిన పాదయాత్రను పోలీసులు మరోసారి భగ్నం చేశారు. పంజాబ్-హర్యానా సరిహద్దు శంభు వద్ద శుక్రవారం రైతులు ప్రారంభించిన పాదయాత్రపై పోలీసులు బాష్ప వాయు గోళాలు ప్రయోగించడంతో పలువురు గాయపడిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం నాటి ఆందోళనలో హర్యానా పోలీసులు చాలా నాటకీయంగా వ్యవహరించారు. 101 మంది రైతులు తిరిగి యాత్ర ప్రారంభించగా, వారికి పోలీసులు టీ, బిస్కెట్లు పంచి ఆశ్చర్చపరిచారు. అంతేకాకుండా వారిపై పూల రేకలను కూడా చల్లడంతో రైతులు విస్తుపోయారు.(రైతులు ఢిల్లీ వైపు వెళ్లడానికి ప్రయత్నించగా, అప్పటి వరకు తాము ఆడిన డ్రామాకు తెరదించిన పోలీసులు వారిని అడ్డుకోవడం ప్రారంభించారు. రైతులను చెదరగొట్టడానికి నిర్దాక్షిణ్యంగా బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులు ప్రయోగించారు. ఈ ఘటనలో 8 మంది రైతులు గాయపడగా, ఒకరిని దవాఖానకు తరలించినట్టు రైతు నేత శర్వణ్ సింగ్ పాంథేర్ తెలిపారు. రైతు పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఆయన ప్రకటించారు. తదుపరి కార్యాచరణను సోమవారం నిర్ణయిస్తామని చెప్పారు.నోయిడాలో ఆందోళన చేయడంతో అరెస్టయి జైలులో ఉన్న రైతులు తమ డిమాండ్ల సాధనకు జైలులో నిరాహార దీక్ష ప్రారంభించినట్టు సంయుక్త కిసాన్ మోర్చా ఆదివారం తెలిపింది. ప్రస్తుతం గౌతమబుద్ధ నగర్ జైలులో ఉన్న రైతులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల సాధనకు ఈ దీక్ష చేపట్టారని పేర్కొంది. ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉన్నా డిమాండ్లు నెరవేరే వరకు దీక్ష చేస్తామని రైతులు స్పష్టం చేశారన్నారు.

# ఇక నిలదీయడమే!

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు కాళేశ్వరం అంశాన్ని ముందుకు తెచ్చింది. ఉద్యోగులకు మొండి చేయి చూపుతూ కేవలం ఒకేఒక్క డీఏను విడుదల చేసి అది కూడా 17 వాయిదాల్లో చెల్లిస్తోంది.దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దిన గురుకుల విద్యాలయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అస్తవ్యస్తం చేసింది. విషాహారంతో పిల్లలు చనిపోవడాన్ని చూసి సభ్య సమాజం సిగ్గు పడుతోంది. గురుకుల బాట పేరిట బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన కమిటీని ప్రభుత్వం అడ్డుకుంది. గురుకులాల్లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని పార్టీ కమిటీ నివేదిక ఇచ్చింది. గురుకుల విద్యా సంస్థల్లో సమస్యలపై బీఆర్ఎస్ త్వరలో కార్యాచరణ ప్రకటిస్తుంది. గురుకుల విద్యా సంస్థల్లో వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగట్టాలి..' అని కేసీఆర్ సూచించారు.

'తెలంగాణ అస్తిత్వం, ప్రజల ఆకాంక్షల మీద సోయి లేని సీఎం కేవలం రాజకీయ స్వార్థంతో పాటు నాపై ఉన్న కక్షతో తెలంగాణ విగ్రహం రూపురేఖలు మార్చే పిచ్చి పనులకు పూనుకుంటున్నాడు. తెలంగాణ తల్లి భావన కేవలం నాది మాత్రమే కాదు, మొత్తం తెలంగాణ సమాజానిది. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే మూర?త్వంతో సీఎం వ్యవహరిస్తున్నాడు. ప్రత్యేక ఆంధ్ర ఉద్యమ సమయంలో ఆంధ్రామాత అనే భావన ముందుకు తెచ్చిన అక్కడి నాయకత్వం తర్వాత తెలుగు తల్లిని తెరమీదకు తెచ్చి తెలంగాణ అస్తిత్వాన్ని మరిపించింది.తెలుగు తల్లి విగ్రహం ఒక రకంగా తెలంగాణ ప్రజల్లో అస్తిత్వ భావనకు ఊపిరిపోసింది. ఇక్కడి ప్రజల అస్తిత్వానికి చిహ్నంగా తెలంగాణ తల్లిని భగవత్ స్వరూపంలో చేతులెత్తి మొక్కేలా రూపొందించాం. అనేకమంది మేధావులు, కవులు, కళాకారులు వేలాది గంటల పాటు చర్చించి, శ్రమించి తెలంగాణ చారిత్రక సాంస్కృతిక సామాజిక నేపథ్యంలో నుంచి ప్రస్తుత తెలంగాణ తల్లి రూపాన్ని తీర్చిదిద్దారు. సమైక్య పాలనలో మరిచిపోయిన తెలంగాణ ప్రతీకలను ఉద్యమ సమయంలో పునరుజ్జీవింప చేసుకోవడానికే తెలంగాణ తల్లిని నిలుపుకున్నాం.కానీ తెలంగాణ సాంస్కృతిక వారసత్వంపై అవగాహన లేని సీఎం తెలంగాణ అస్తిత్వానికి మచ్చ తెస్తున్నారు. కొత్త రూపంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న తెలంగాణ విగ్రహం ఆవిష్కరణకు నన్ను ఆహ్వానించడం వెనుక ఉన్న కోణం, ఉద్దేశం ఏదైనా ఇంటికి వచ్చిన మంత్రికి తెలంగాణ సాంప్రదాయం ప్రకారం భోజనం పెట్టి సాదరంగా గౌరవించాం..' అని మాజీ సీఎం చెప్పారు. 'కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని విర్రవీగుతున్న ముఖ్యమంత్రి నేను చేపట్టిన అనేక పనులు, పథకాలను ప్రారంభిస్తున్నాడు. యాదాద్రి పవర్ ప్లాంట్ కేసీఆర్ ఆనవాలు అనే విషయం తెలియదా. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయడంపై అసెంబ్లీలో నిలదీయాలి, రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని స్థిరీకరిచేందుకు దార్శనికతతో వ్యవసాయ అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం. ఎలాంటి పరిమితులు విధించకుండా రైతుబంధును అందజేశాం. కానీ ఎన్నికల సమయంలో రైతులకు ఆశపెట్టి ఎగవేస్తున్న ప్రభుత్వ వైఖరిని అసెంబ్లీలో ఎండగట్టాలి. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల హామీల అమలుపై నిలదీయాలి. కేవలం ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించడానికే పరిమితం కాకుండా గతంలో బీఆర్ఎస్ పాలనలో అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను వివరించాలి..' అని కేసీఆర్ చెప్పారు.

**వచ్చే ఏడాదంతా సంస్థాగత నిర్మాణం**

'ప్రజలు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్‌ను మాత్రమే చూస్తున్నారు. ఫిబ్రవరి చివరి వారంలో వరంగల్, హైదరాబాద్ కాకుండా అందరికీ అందుబాటులో ఉండే చోటును చాటుకుని భారీ జనసమీకరణతో సభ నిర్వహిద్దాం. వచ్చే ఏడాదంతా పూర్తిగా పార్టీ సంస్థాగత నిర్మాణం, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యవర్గాల ఏర్పాటు, సంస్థాగత శిక్షణ కార్యక్రమాలపైనే దృష్టి పెడదాం. జమిలి ఎన్నికలు జరిగే పక్షంలో పెద్దగా సమయం ఉండదు. మళ్లీ అధికారంలోకి వంద శాతం మనమే వస్తాం..'

## మంచు ఫ్యామిలీలో

# ఆస్తుల మంటలు?



పహాడీషరీఫ్: ప్రముఖ సినీనటుడు మోహన్‌బాబు, ఆయన కుమారుడు, నటుడు మనోజ్ మధ్య ఆస్తుల విషయమై గొడవ ఘర్షణకు దారితీసినట్టు తెలుస్తున్నది. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జల్‌పల్లి ఫాంహౌస్‌లో ఇరువురు గొడవపడ్డట్టు సమాచారం. ఆదివారం ఉదయం మోహన్‌బాబు, మనోజ్ ఇద్దరి నుంచి డయల్ 100కు కాల్ రావడంతో పహడీ షరీఫ్ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు మోహన్‌బాబు ఫాంహౌస్‌కు వెళ్లారు. ఇరువురిని విచారించిన తర్వాత ఘటనపై ఎస్ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫామ్‌హౌజ్‌కు వెళ్లి మోహన్‌బాబు, మనోజ్‌ను విచారించాం. స్వల్పంగా గొడవ పడ్డట్టు చెప్పారు. అంతర్గతంగా చర్చించుకుంటామని తెలిపారు అని వివరించారు. అటు గొడవపై తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని డీఐ జితేందర్‌రెడ్డి తెలిపారు. అప్పటికే ఈ వార్త మీడియాలో చక్కర్లు కొట్టింది.అదే సమయంలో ఇంట్లో ఎలాంటి గొడవ జరగలేదని, అంతా మీడియా ప్రచారమే అంటూ మోహన్‌బాబు చెప్పినట్టుగా మరో న్యూస్ వచ్చింది. అంతటితో వివాదం సద్దుమణిగిందని మీడియా వర్గాలు భావించాయి. కానీ ఈ నేపథ్యంలో మనోజ్ గాయాలతో బంజారాహిల్స్‌లోని ఓ దవాఖానలో చికిత్స కోసం చేరారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మనోజ్ నడవడానికి కూడా ఇబ్బం ది పడుతున్నట్టు దృశ్యాల్లో కనిపిస్తున్నది. మనోజ్ వెంట ఆయన భార్య మౌనిక కూడా ఉన్నారు. తన తండ్రి మోహన్‌బాబు, అతడి అనుచరులు కలసి తనపై దాడి చేశారని మనోజ్ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. మోహన్‌బాబు, మనోజ్ నేరుగా మీడియా ముందుకు వచ్చి ఎలాంటి ప్రకటనలు చేయకపోయినా రోజం తా జరిగిన పరిణామాలు మంచు ఫ్యామిలీలో గొడవ జరిగినట్టు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరిగింది. గొడవ జరిగిన మాట వాస్తవ మేనని పోలీసులు కూడా ధ్రువీకరించడంతో కారణాలపై పలు కోణాల్లో ప్రచారం నడుస్తున్నది. విద్యాసంస్థలు, ఆస్తుల పంపకం వ్యవహారంలో కొంతకాలంగా వివాదం నడుస్తున్నదని, ఇదే ఘర్షణకు దారి తీసి ఉంటుందని భావిస్తున్నారు.

# తెలంగాణ తల్లి పండుగ

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి తొలి ప్రకటన 2009 డిసెంబరు 9న వెలువడిన విషయం తెలిసిందే. దీంతో ఆ రోజును పండుగలా నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానుండగా.. తొలి రోజు సమావేశంలోనే తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవంపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేయనున్నారు. దీంతోపాటు విగ్రహం రూపకల్పన తదితర అంశాలపైనా ప్రకటన చేస్తారు. అనంతరం ఆ ప్రకటనపై సభలో చర్చ జరగనుంది. చర్చ ముగిసిన తర్వాత తెలంగాణ తల్లి ఉత్సవాల నిర్వహణపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. ఉత్తర్వులు జారీ అయ్యాక.. సచివాలయంలో జయజయహే తెలంగాణ గీతాలాపన నడుమ.. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఆ విగ్రహ శిల్పి రమణారెడ్డికి, జయ జయహే గీత రచయిత అందెశ్రీకి సన్మానం చేస్తారు. ఈ సందర్భంగా గద్దర్, గూడ అంజన్న వంటి కళాకారుల త్యాగాలకు గుర్తుగా ఓ ప్రకటన కూడా చేసే అవకాశం ఉంది.ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని 2009లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిన సంగతి తెలిసిన విషయమే. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీనే తెలంగాణకు తల్లి అంటూ కాంగ్రెస్ ముఖ్య నాయకులు ప్రకటనలు కూడా చేస్తుంటారు. తాజాగా సోనియాగాంధీ పుట్టిన రోజున తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి.. ఏటా అదే రోజున ఉత్సవాలు నిర్వహించాలన్న నిర్ణయానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రావడం ఒక రకంగా ఆమెకు ఇస్తున్న జన్మదిన కానుకేనని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# శీతాకాల సమరం

(మొదటి పేజీ తరువాయి)

గత ఏడాది కాలంలో రాష్ట్రంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలను ప్రజల ముందుంచేందుకు అధికార కాంగ్రెస్ సిద్ధమైంది.అదే సమయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ఎత్తిచూపడం, అప్పటి రుణాలను తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అప్పులు చేయాల్సి వస్తోందని ప్రజల్లోకి తీసుకెళ్లడం లక్ష్యంగా వ్యూహాలు పన్నుతోంది. మరోవైపు గత ఏడాది కాలంలోని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపడం, హామీల అమలుపై నిలదీయడమే ఎజెండాగా ప్రతిపక్షాలు సభకు హాజరుకానున్నాయి. రైతు రుణమాఫీ జరిగిన తీరు, రైతు భరోసా ఇవ్వకపోవడం, ధాన్యం కొనుగోళ్లు, ఆరు గ్యారంటీల అమలు, ఫోన్ ట్యాపింగ్, లగచర్ల ఘటన, గురుకులాల్లో ఫుడ్ పాయిజనింగ్ తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ వ్యూహాలు పన్నుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం హామీల అమల్లో విఫలమైందంటూ చార్జిషీట్లు ప్రకటించిన బీజేపీ.. ఆయా అంశాలను, ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇక హైదరాబాద్ నగరంలో జరుగుతున్న అభివృద్ధిపై చర్చించాలని కోరాలని ఎంఐఎం భావిస్తోంది. శాసనసభ శీతాకాల సమావేశాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్)%-%2024 చట్టాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఆర్వోఆర్%-%2020 చట్టానికి పలు సవరణలు చేసి దీనిని రూపొందించింది. 'హైడ్రా'కు చట్టబద్ధత కల్పించనుంది. మహిళా యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ బిల్లులు కూడా సభ ముందుకు రానున్నాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన అనంతర కార్యాచరణ, స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసే అవకాశం ఉంది. రైతు రుణమాఫీ జరిగిన తీరును, రైతు భరోసా విధివిధానాలను అసెంబ్లీ వేదికగానే ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ కొనుగోళ్లు, జెన్‌కో ప్రాజెక్టుల నిర్మాణంపై ఏర్పాటు చేసిన జస్టిస్ మదన్ బి లోకూర్ కమిటీ ఇచ్చిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమవుతున్నట్టు సమాచారం. సోమవారం ఉదయం సభ ప్రారంభమైన తర్వాత తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై సీఎం రేవంత్ ప్రకటన చేయనున్నారని అధికార వర్గాలు తెలిపాయి.

# ఏడాది పాలన.. ఎడతెగని వంచన

(మొదటి పేజీ తరువాయి)

ఏడాదిలోనే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందుని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో కూడా ఎరుగని నిర్బంధకాండను రేవంత్ ప్రభుత్వం అమలుచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనపై ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ తరఫున హరీశ్‌రావు చార్జిషీట్ విడుదల చేశారు. త్వరలో ప్రభుత్వంలో జరుగుతున్న కుంభకోణాలపై మరో చార్జ్షీట్ విడుదల చేస్తామని ప్రకటించారు. 'సీఎం సొంత ఊరికి ఎవరైనా వెళ్లాలంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి. బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చి ఎమర్జెన్సీని తలపిస్తున్నాడు'అని మండిపడ్డారు. 'రేవంత్ పాలన ప్రతికూల దృక్పథంతో ప్రారంభం కావడంతో ప్రతికూల ఫలితాలే వస్తున్నాయి. శ్వేతపత్రాల పేరిట రోత పత్రాలు విడుదల చేసి రాష్ట్రం దివాలా తీసిందనే నెగెటివ్ ఇమేజ్ సృష్టించారు. రేవంత్ మార్పు పాలన దేశం ముందు నవ్వుల పాలైంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేదు. సీఎం నిర్వహిస్తున్న శాఖల్లోనే పరిస్థితులు అస్తవ్యస్తంగా మారాయి. రాజకీయ కక్ష సాధింపు చర్యలు పెచ్చుమీరాయి.కృష్ణా నది ప్రాజెక్టులపై పదేండ్లు కేసీఆర్ కాపాడిన హక్కులను.. అధికారంలోకి వచ్చి నెల తిరక్కుండానే కేంద్రానికి కట్టబెట్టారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పెరిగితే, రేవంత్ పాలనలో ఇరిటేషన్ పెరిగింది. రైతు సంక్షేమానికి రాహుకాలం.. వ్యవసాయానికి గ్రహణం పట్టింది. బడిలో చదువుకోవాల్సిన పిల్లలు ఆసుపత్రుల్లో కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్నారు. హైడ్రా రూపంలో రేవంత్ రెడ్డి విధ్వంసం సృష్టించారు. మూసీ ప్రక్షాళన పేరిట మూటలు వెనకేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. తిక్క విధానం, తిట్ల పురాణం అవలంబిస్తున్న సీఎంకు దుర్భాష దురంధరుడు అనే బిరుదు ఇవ్వవచ్చు'అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

# మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా నర్వేకర్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా బీజేపీకి చెందిన రాహుల్ నర్వేకర్ ఏకగ్రీవ ఎన్నికకు రంగం సిద్ధమైంది. నర్వేకర్ ఆదివారం సీఎం ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలు షిండే, అజిత్‌లతో కలిసి అసెంబ్లీ కార్యదర్శి జితేంద్ర భోలెకు నామినేషన్ పత్రాలను అందజేశారు. స్పీకర్ పదవికి పోటీ పడరాదన్న ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) నిర్ణయంతో నర్వేకర్ ఎన్నిక ఏకగ్రీవం కానుంది. సోమవారం అసెంబ్లీలో బలపరీక్ష అనంతరం స్పీకర్ ఎన్నికపై నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశముంది. అనంతరం గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ శాసనసభ, శాసనమండలి సభ్యులతో జరిగే ఉమ్మడి సమావేశంలో ప్రసంగిస్తారు. అదేవిధంగా, ప్రొటోకాల్ ప్రకారం డిప్యూటీ స్పీకర్ పదవిని తమ కూటమిలోని పార్టీలకు వదిలేయాలని ఎంవీఏ నేతలు ఆదివారం సీఎం ఫడ్నవీస్‌ను కలిసి కోరారు. ప్రతిపక్ష నేత పదవిని కూడా ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. ఇటీవలి ఎన్నికల్లో అసెంబ్లీలోని 288 సీట్లకుగాను మహాయుతి 230 స్థానాలను గెల్చుకోవడం తెల్సిందే. ముంబైలోని కొలాబా నుంచి మళ్లీ ఎన్నికైన రాహుల్ నర్వేకర్ గత 14వ అసెంబ్లీ స్పీకర్‌గా రెండున్నరేళ్లపాటు కొనసాగారు. ఆ సమయంలో శివసేన, ఎన్సీపీ చీలిక వర్గాల వ్యవహారంపై మహాయుతి ప్రభుత్వానికి అనుకూలంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**శివసేన(షిండే)కు 11 మంత్రి పదవులు!**

మహారాష్ట్రలో మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. అతిత్వరలో విస్తరణ ఉంటుందని మహాయుతి ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కూటమిలో కీలక భగస్వామి అయిన శివసేన(షిండే)కు 11 మంత్రి పదవులు దక్కనున్నట్లు సమాచారం. ఆ పార్టీ నేత ఏక్‌నాథ్ షిండే ఇప్పటికే ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. కీలక శాఖలు ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నారు. శివసేన(షిండే) నుంచి మంత్రులుగా ప్రమాణం చేసేవారిలో ఆరుగురు మాజీ మంత్రులే ఉంటారని సమాచారం. కొత్తగా ఐదుగురికి మంత్రి యోగం పట్టబోతున్నట్లు తెలుస్తోంది. కనీసం 13 మంత్రి పదవులు కావాలని శివసేన(షిండే) డిమాండ్ చేయగా 11 పదవులకు బీజేపీ అంగీకరించినట్లు సమాచారం.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దారి చూపిన వీరమాత చాకలి ఐలమ్మ

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

### కోకాపేట్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే






**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దారి చూపిన వీరమాత చాకలి ఐలమ్మ అని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్‌లో రజక సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల పెత్తనాన్ని ఎదిరిఅంచిన దీశాలి అని, రజాకారాలను తరిమికొట్టిన వీర వనిత అని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి దారి చూపిన వీరమాత చాకలి ఐలమ్మ అలియాస్ చిట్యాల ఐలమ్మ అని తెలిపారు. ఆమె తొలి పోరాటానికి నాంది పలికిందన్నారు. దొరలు ఆక్రమించిన భూమిపై ప్రతిగడించి విజయం సాధించిందని ఐలమ్మ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, టీపీసీసీ ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, నార్సింగి మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్ బాబు, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్, కౌన్సిలర్లు,ఉషారాణి, దుర్గేష్ యాదవ్, శివారెడ్డి, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్,నరసింహ, రజక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని నార్సింగి ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఆదివారం ఉదయం నార్సింగి రోటరీ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల డ్రైవ్‌ను చేపట్టి నెంబర్‌ప్లేట్‌లు సరిగ్గా లేని 20 వాహనాలను గుర్తించి వాటికి ఛాలన్‌లు విధించి యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సిప్ ఏ.రాజేష్‌గౌడ్, ఏఆర్ఎస్ఐ చందర్, పీసీలు సురేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేకు సహకరించాలి

### మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్






**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రజా పాలనలో ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల కోసం ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక చేసేందుకు సర్వే ప్రారంభిస్తున్నట్లు మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. ఈ నెల 9వ తేదీ నుంచి ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి సంబంధిత వార్డు ఆఫీసర్ పూర్తి వివరాలను నమోదు చేసుకోని సరేర్వ చేస్తారన్నారు. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు నేటి వార్డు పరిధిలో అధికారులు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం ప్రజాపాలన పరిశీలన నిమిత్తం వారి ఇంటికి వచ్చి పరిశీలన జరుపుతారన్నారు. అందుకు పూర్తి సమాచారం అందించాలని కోరారు. ఈ సర్వేలో చైర్ పర్సన్, వైస్ చైర్మన్, పాలక వర్గం సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, ఇందిరమ్మ కమిటి సభ్యులు సహకరిస్తు ప్రజలకు సర్వే వివరాలను తెలపాలని సూచించాలని కోరారు.





# అయ్యప్ప దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

గండిపేట్(క్రైం మిర్రర్): అయ్యప్ప స్వామి దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిర్వహించిన అయ్యప్ప స్వామి మహాపడి పూజలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శంషాబాద్ మండలం తొండుపల్లి, నార్సింగి మున్సిపాలిటీ ఖానాపూర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మిగూడ, వాంబే కాలనీ ప్రాంతాలలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప దివ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ పూజల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.






## డిసెంబర్ 15 న సిపిఎం పార్టీ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలి...

### ప్రచార రథాన్ని ప్రారంభించిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు నరసింహ

**చౌటుప్పల్,డిసెంబర్ 08(క్రైమ్ మిర్రర్):** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు యాదాద్రి భువనగిరి సిపిఎం మూడో జిల్లా మహాసభ డిసెంబర్ 15 న యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలో భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆటో ప్రచార రథాన్ని ప్రారంభించిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు నరసింహ. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మూడు రోజులు చర్చలు జరిపి కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు.ఈ బహిరంగ సభకు జిల్లావ్యాప్తంగా ఉన్న సిపిఎం పార్టీ నాయకులు వేలాది మంది హాజరవుతారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు తడక మోహన్, పల్లె మధుకృష్ణ,ఆదిమూలం నందీశ్వర్, చెన్నబోయిన వెంకటేశం,కొండే శ్రీశైలం,కందగట్ల ఆనంద్, తీగుళ్ల శ్రీనివాస్ సప్పిడి రాఘవరెడ్డి,ఇట్టబోయిన శేఖర్, భిమగోని బాలరాజు, గజ్జి పాండు,తదితరులు పాల్గొన్నారు..

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య



**చౌటుప్పల్,డిసెంబర్ 08(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లాచౌటుప్పల్ మండల స్వాములవారి లింగోటం గ్రామానికి చెందిన కీ. శే. చేగూరి అంజయ్య అనారోగ్యంతో మృతిచేందారు.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు బీమిడి ప్రదీప్ జీ కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యంలో మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి,10,వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు పేద ప్రజలకు అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు, కార్యవర్గం, దేవాలయ కమిటీ అధ్యక్షులు కార్యవర్గం, మాజీ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ మరియు పాలక వర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పెద్దలు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పై నోరు పారేసుకుంటే ఖబడ్దార్

### ఆదర్శ నేతను అవమాన పరిస్తే చూస్తూ ఊరుకునేది లేదు

**కేశంపేట మండల కాంగ్రెస్ మైనారిటీ నేత ఎండీ ఇబ్రాహీం**



కేశంపేట,(క్రైమ్ మిర్రర్): అభివృద్ధిలో అందరికీ ఆదర్శంగా నిలుస్తూ... షాద్ నగర్ నియోజకవర్గాన్ని సర్వతో ముఖాభివృద్ధిగా తీర్చి దిద్దుతున్న బడుగు బలహీన వర్గాల నేత షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై పనికి మాలిన కొందరు అసభ్యంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేశంపెట్ మండలానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ నేత ఎండి ఇబ్రహీం అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జోలికొస్తే తాట తీస్తామని, సామజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యే పై అనుచిత పోస్టులు పెట్టిన వారిపై, ఫోన్లో ఎమ్మెల్యేను ఉద్దేశించి అసభ్యంగా మాట్లాడిన మూర్ఖుడిపై తక్షణమే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సౌమ్యుడైన షాద్ నగర్ ఎమ్మెల్యే జోలికొస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు .

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# రారండోయ్ వేడుక చూద్దాం




- నేడు ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు వేడుకలు
- సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ
- ఎన్టీఆర్ మార్గ్లో డ్రోన్ షో
- పెద్ద ఎత్తున బాణసంచా ప్రదర్శన
- సంగీత దర్శకుడు తమన్ నేతృత్వంలో మ్యూజికల్ నైట్

హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మూడు రోజులు పాటు ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్‌లో నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలు సోమవారంతో ముగియనున్నాయి. ముగింపు వేడుకల సందర్భంగా సచివాలయంలో సాయంత్రం 5 గంటలకు కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ గ్రౌండ్‌లో లక్ష మంది స్వయం సహాయక సంఘాల మహిళలతో భారీ బహిరంగ సభ జరగనుంది. సాయంత్రం 7.30 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లో డ్రోన్ ప్రదర్శన, హుస్సేన్ సాగర్‌లో పెద్దఎత్తున బాణసంచా ప్రదర్శన, అనంతరం హెచ్ఎండీఏ మైదానంలో తమన్ నేతృత్వంలో సంగీత కచేరీ, సాంస్కృతిక ప్రదర్శన ఉంటుంది. ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులో ఫుడ్‌స్టాళ్లతో పాటు హస్తకళల, సాంస్కతిక, పలు ప్రభుత్వ విభాగాలకు చెందిన స్టాళ్లను ఏర్పాటు చేశారు.

**బహు పసందుగా ఫుడ్ స్టాళ్లు**

ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నెక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లలోని పలు పసందైన వంటకాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. నగరంలో ప్రసిద్ధి చెందిన పలు బ్రాండెడ్ హోటల్స్ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేశాయి. హైదరాబాదీ బిర్యానీ, మొఘలాయి, తెలంగాణ, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరీ ఐటమ్స్ చాట్, ఐస్‌క్రీం.. ఇలా వందకు పైగా ఫుడ్‌స్టాళ్లు అందుబాటులో ఉన్నాయి.

వీటితో పాటు తెలంగాణ వంటకాలు పాలమూరు గ్రిల్, తెలంగాణ విందు, అంకాపూర్ నాటుకోడి చికెన్, ఫుడ్ జాయింట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా నగరమంతా విద్యుత్ దీపాలంకరణతో జిగేమంటోంది. డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయం, పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో తళుక్కుమంటున్నాయి.



## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన బి.ఆర్.ఎస్ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న ఖమ్మం జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం జిల్లా ప్రతినిధి :** సమావేశం అనంతరం అధినేత కేసీఆర్ ను ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ కలిశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అధినేత కేసీఆర్ గారికి ఈ సందర్భంగా వారు వివరించారు.

## మణికొండ వీఆర్4యూ గ్రూప్ ఆధ్వర్యంలో నిరుపేదలకు 80 దుప్పట్ల పంపిణి



గండిపేట్(క్రైం మిర్రర్): సేవా కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని మణికొండ వీఆర్4యూ గ్రూప్ అధ్యక్షులు బాపూజీ, సెక్రటరీ డి.ఎస్.ఆర్.దాస్‌లు అన్నారు. శీతాకాలంలో విపరీతమైన చలిని దృష్టిలో ఉంచుకోని సంస్థ ఆధ్వర్యంలో పేద ప్రజలకు, బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రి, సరోజిని కంటి ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో 80 మందికి దుప్పట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్4యూ గ్రూప్ సభ్యులు ఈ సామాజిక ప్రయోజనం కోసం ఉదారంగా విరాళాలు అందించారన్నారు. వీఆర్4యూ గ్రూప్ గత 9 సంవత్సరాల నుంచి మణికొండ పరిసర ప్రాంతాలలో అనేక సామాజిక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తుంతదన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాపూజీ, డి.ఎస్.ఆర్.దాస్, నాగేంద్రరావు, ప్రదీప్‌రావు, ప్రభావతి, విజయలక్ష్మి, రంగాచారి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్




గండిపేట్(క్రైం మిర్రర్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వేను ముమ్మరంగా నిర్వహిస్తామని మణికొండ మున్సిపాలిటీ కమీషనర్ ప్రదీప్‌కుమార్ సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిత్రపురి ఎల్ఐజీ, కుతుబ్‌షా ఎన్‌క్లేవ్ కాలనీలలో ప్రజా పాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ధరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్వేను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన సర్వేను పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



# ఆ కానిస్టేబుల్ ప్రైవేట్ వెహికిల్ ఎందుకు నడిపారు?

- మిస్టరీగా వాజేడు ఎస్సై ఆత్మహత్య
- హరీశ్ బలవన్మరణానికి యువతే కారణమా?
- ఇప్పటి వరకూ వివరాలు వెల్లడించని పోలీసులు



ములుగు : వాజేడు ఎస్సై హరీశ్ ఆత్మహత్యకు గల ప్రధాన కారణాలను పోలీసులు ఇప్పటి వరకూ వెల్లడించలేకపోతున్నారు. ఎస్సై ఆత్మహత్య రోజు ఏమి జరిగిందనే అంశం మిస్టరీగా మారుతోంది. నల్లగొండ జిల్లా చిలుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ తండాకు చెందిన యువతి బ్లాక్ మెయిలింగ్ కారణంగానే ఎస్సై ఆత్మహత్యకు పాల్పడ్డాడనే వార్తలు వెలువడుతున్నాయి. దీంతోపాటు మరేమైన బలమైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసు యంత్రాంగం రహస్యంగా వివరాలు సేకరిస్తోంది. సదరు యువతి ఈ నెల 1వ తేదీన ఎస్సై హరీశ్ కోసం వచ్చినట్లు ఆధారాలతో పూర్తి సమాచారం ఉంది. ఈ క్రమంలో ఫెరిడోస్ రిసార్ట్‌లోని ఓ గదిలో ఎస్సై ఆత్మహత్య అనంతరం సదరు యువతిని పోలీస్ శాఖతో పాటు ఇతరులు గమనించారు. దీంతో ఎస్సై హరీశ్ ఆత్మహత్య ఘటనలో ఆమె ప్రధాన కారణమా లేక ఇతర విషయాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. హరీశ్ చనిపోక ముందు రోజు యువతితో మాట్లాడే క్రమంలో ఒత్తిడికి లోనై స్నేహితులకు ఫోన్ చేశారు. దీంతో ఓ స్నేహితుడు రిసార్ట్‌కు చేరుకుని యువతితో మాట్లాడి ఆమెను ఒప్పించినట్లు సమాచారం. సమస్య సద్దుమనిగినట్లు భావించిన ఎస్సై హరీశ్ స్నేహితుడిని వెళ్లిపోవాలని సూచించినట్లు తెలిసింది. దీంతో అతను అక్కడి నుంచి బయలుదేరి ములుగు చేరుకున్నాడు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో నిద్ర నుంచి లేచిన సదరు యువతి.. ఎస్సైతో గొడవకు దిగినట్లు సమాచారం. దీంతో మరోసారి ఒత్తిడికి లోనైన హరీశ్ ఫోన్ ద్వారా స్నేహితుడిని సంప్రదించాడు. అప్రమత్తమైన స్నేహితుడు ములుగు నుంచి బయలుదేరి వాజేడుకు చేరుకోకముందే ఎస్సై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

**ఆ కానిస్టేబుల్ ప్రైవేట్ వెహికిల్ ఎందుకు నడిపారు?**

వాజేడు ఎస్సై ఆత్మహత్యకు పాల్పడడానికి ప్రధాన కారణంగా తెలుస్తున్న సదరు యువతి ఈనెల 1వ తేదీ వాజేడు స్టేషన్ ముందు నుంచి ఎస్సై హరీశ్‌కు కాల్ చేసింది. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ వెహికిల్ ద్వారా ఆమెను రిసార్ట్‌కు పంపించారు. అయితే ఈ వాహనాన్ని నడిపిన వాజేడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎవరు అనే అంశం ఇప్పటికీ తెలియడం లేదు. చివరికి ఆ యువతిని రిసార్ట్‌లో డ్రాప్ చేసిన అనంతరం రెండు, మూడు సార్లు సదరు వ్యక్తి ప్రైవేట్ వాహనంలో కనిపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

## కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ ఛార్జ్‌షీట్.. మంత్రి కోమటిరెడ్డి రియాక్షన్

హైదరాబాద్: కాంగ్రెస్ ఏడాది పాలనపై బీఆర్ఎస్ విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. పదేళ్లలో మీరు ఏం చేశారని.. మాపై ఛార్జ్‌షీట్ అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి చేయని పథకం లేదంటూ దుయ్యబట్టారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్ రాకుంటే చరిత్ర హీనునిగా మిగిలిపోతారంటూ వ్యాఖ్యానించారు. హరీష్, కేటీఆర్ గురించి మాట్లాడడం అనవసమని సీఎం రేవంత్ రెడ్డికి సూచించా.. ఇక నేను కూడా మాట్లాడను.





## రావిర్యాల పెద్ద చెరువులో గుర్తు తెలియని మృత దేహం లభ్యం

**మృతుడు ఎవరనే కోణంలో దర్యాప్తు చేస్తున్న అదిబట్ల పోలీసులు**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని రావిర్యాల పెద్ద చెరువులో ఆదివారం ఉదయం చేపలు పట్టాడానికి మత్యాకారులు ఉదయం 8 గంటల సమయంలో చెరువులోకి వెళ్లగా సర్దార్ నగర్ వైపు నుండి ఒక మృత దేహం కొట్టుకు వచ్చిందని అదిబట్ల పోలీసులకు సమాచారామిచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు మత్య కారుల సహాయంతో మృత దేహాన్నిఒడ్డుకు తీసుకు వచ్చి చూడగా సుమారు 25 సంవత్సరాలు,ఎత్తు 5.7 వయస్సు ఉన్న మృతదేహాన్ని కనుగొన్నరు ముదురు ఆకుపచ్చ టీ-షర్టు, నలుపు మరియు తెలుపు చుక్కలు 3/4 పొట్టిగా నడుముకు మొలదారం మరియు మణికట్టు దారాలు ధరించి హిందువుగా గుర్తించారు.మృతుడు చనిపోయి సుమారు నాలుగు రోజులు అవుతుందని అన్నారు. మృతుడు. ఇక్కడికి ఎలా వచ్చాడని,ఇతనిని ఎవరైనా చంపి తీసుకువచ్చారా, లేక స్నానం కోసం వెళ్లి చెరువులో పడిపోయాడ...? అనే కోణంలో అదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

## భద్రతా బలగాల బేస్ క్యాంప్‌పై మావోల మెరుపు దాడి



రాయ్‌పూర్ : తెలంగాణ-ఛత్తీస్ ఘడ్ సరిహద్దులోని పామేడు ఏరియాలో ఉద్రిక్తత నెలకొంది. పామేడు వద్ద భద్రత బలగాల బేస్ క్యాంప్‌పై మావోయిస్టులు మెరుపు దాడి చేశారు. మావోయిస్టల దాడుల్ని భద్రతబలగాలు తిప్పుకొడుతున్నాయి. కాగా, మావోయిస్టల చేసిన దాడిలో ఐదుగురు భద్రతా బలగాలకు గాయాలయ్యాయి. అప్రమత్తమైన భద్రతా బలగాలు గాయపడ్డ జవాన్లను అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.




## హ్యుందాయ్ కార్లు ప్రియం

న్యూఢిల్లీ, డిసెంబర్ 5: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన హ్యుందాయ్ మోటర్ ఇండియా కూడా తన వాహన ధరలు పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల వాహన ధరలను రూ.25 వేల వరకు పెంచుతున్నట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం పెరగడంతోపాటు ఫారెక్స్ మార్కెట్లో కరెన్సీ హెచ్చుతగ్గుదలకు లోనుకావడం, లాజిస్టిక్స్ ఖర్చులు అధికం కావడం వల్లనే ధరలు పెంచాల్సి వచ్చిందని కంపెనీ డైరెక్టర్, సీవోవో తరుణ్ గార్గ్ వెల్లడించారు. కొత్త మాడల్‌తోపాటు పాత మాడళ్లకు కూడా ఈ ధరల పెంపు వర్తించనున్నదన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.5.92 లక్షల విలువైన గ్రాండ్‌ఐ10 నియోస్ నుంచి రూ.46.05 లక్షల విలువైన ఎలక్ట్రిక్ వాహనం అయోనిక్ 5 మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

# 15 లక్షల కోట్లు పెరిగిన సంపద

**గత ఐదు రోజుల్లో పరుగులు పెట్టిన మార్కెట్ క్యాప్**

**వరుస లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు**

**ఒక్కరోజే సెన్సెక్స్ 810, నిఫ్టీ 241 పాయింట్లు వృద్ధి**

**ఐటీ, టెక్ కంపెనీల షేర్లు ఆకర్షణీయం**



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు పడుతూ.. లేస్తూ.. పయనించినా, ఆఖర్లో మాత్రం లాభాల్లోనే ముగుస్తున్నాయి. ఇలా వరుసగా 5 రోజుల్లో మదుపరుల సంపద సైతం లక్షల కోట్ల రూపాయల్లో పెరగడం విశేషం. గురువారం ఒక్కరోజే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 809.53 పాయింట్లు లేదా 1 శాతం పుంజుకొని 81,765.86 వద్ద స్థిరపడింది. ఒకానొక దశలో 1,361.41 పాయింట్లు ఎగబాకడం గమనార్హం. అయితే ఈ దశలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో సూచీ దిగిరాక తప్పలేదు. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 240.95 పాయింట్లు లేదా 0.98 శాతం ఎగిసి 24,708.40 దగ్గర నిలిచింది.

**అమెరికా జోష్**

భారతీయ ఈక్విటీలు ఇంతలా బలపడటానికి అమెరికా మార్కెట్ల ర్యాలీ బాగా కలిసొచ్చింది. అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థ ఆకర్షణీయ వృద్ధిని కనబరుస్తుండటం, ద్రవ్యోల్బణం దిగొస్తుండటంతో తొలిసారి డోజోన్స్ 45వేల మార్కును దాటింది. అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన దగ్గర్నుంచీ అమెరికా వృద్ధి సూచీలు పరుగులు పెడుతున్నాయి మరి. అక్కడి ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ చీఫ్ పావెల్ కూడా దేశ ఆర్థిక ముఖచిత్రం బాగుపడిందని కొనియాడటం.. మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత బలపర్చింది. ఇక దేశీయంగా చూస్తే.. ఐటీ కంపెనీల షేర్లు ఇన్వెస్టర్లను అమితంగా ఆకట్టుకున్నాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు భారీ లాభాలను అందుకున్నాయి. ఐటీ రంగ సూచీ గరిష్ఠంగా 1.96 శాతం పెరిగింది.

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు**

గతకొంత కాలంగా దేశీయ మార్కెట్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణ దిశగా అడుగులు వేస్తున్న విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ).. మళ్లీ కొనుగోళ్ల వైపు వచ్చారు. బుధవారం రూ. 1,797.60 కోట్ల విలువైన షేర్లను కొన్నట్టు స్టాక్ ఎక్స్చేంజీ వర్గాలు తెలిపాయి. దీంతో గురువారం సైతం ఇదే జోష్ ఉందన్న అంచనాలు వస్తున్నాయి. ఇక సెన్సెక్స్‌లో టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లూ పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.27 శాతం, స్మాల్‌క్యాప్ 0.16 శాతం అందిపుచ్చుకున్నాయి. ఇక శుక్రవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలు ఉండనున్నాయి. దీంతో మార్కెట్ ట్రేడింగ్‌పై ఈ ప్రభావం ఎక్కువేనని చెప్పవచ్చు. గత ఏడాది ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగానే ఉంచుతున్న విషయం తెలిసిందే.

**రూ.458 లక్షల కోట్లకు..**

వరుసగా ఐదోరోజూ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగియడంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ కూడా అదే స్థాయిలో పెరుగుతూపోతున్నది. గడిచిన 5 రోజుల్లో బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.15,18,926.69 కోట్లు ఎగిసి రూ.4,58,17,010.11 కోట్లకు (5.41 ట్రిలియన్ డాలర్లు) చేరింది. ఈ ఐదు రోజుల్లో సెన్సెక్స్ 2,722.12 పాయింట్లు లేదా 3.44 శాతం పుంజుకున్నది. 'అంతర్జాతీయ మార్కెట్లలో డోజోన్స్, ఎస్అండ్‌పీ 500, నాస్‌డాక్ లాభాల్లో కదలాడుతుండటం.. భారతీయ మార్కెట్లకు లాభిస్తున్నది' అని మెహెతా ఈక్విటీస్ లిమిటెడ్ రిసెర్చ్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తాప్సీ అన్నారు. ఇక గురువారం జపాన్, చైనా సూచీలు లాభాల్లో, దక్షిణ కొరియా, హాంకాంగ్ సూచీలు నష్టాల్లో ముగిశాయి.




## లక్ష డాలర్లకు బిట్‌కాయిన్

న్యూయార్క్: అదృశ్య కరెన్సీ బిట్‌కాయిన్ జెట్‌స్పీడ్ వేగంతో దూసుకుపోతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న ఈ బిట్‌కాయిన్ తాజాగా లక్ష డాలర్లకు చేరుకున్నది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంఫ్ గెలిచినప్పటీ నుంచి ఈ కరెన్సీ భారీగా పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో గురువారం బిట్‌కాయిన్ విలువ 103,400 డాలర్లకు ఎగబాకింది. ఈ ఏడాది ఈ అదృశ్య కరెన్సీని కొనుగోలు చేసిన వారు కోటీశ్వరులైనారని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

## క్విక్ కామర్స్‌లోకి మింత్రా

**30 నిమిషాల్లో ఉత్పత్తుల డెలివరీ**

**ఎక్స్చేంజ్, రిటర్న్ సౌకర్యం కూడా**




హైదరాబాద్: ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఈ%-%కామర్స్ ప్లాట్‌ఫామ్ మింత్రా క్విక్ కామర్స్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చింది. 'ఎం%-%నౌ' పేరుతో 30 నిమిషాల్లోనే ఉత్పత్తులను డెలివరీ చేయనున్నట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. ప్రస్తుతం బెంగళూరులో ఈ సేవలను అందిస్తోంది. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా మెట్రో, నాన్%-%మెట్రో నగరాల్లో విస్తరించడానికి సిద్ధంగా ఉన్నామని మింత్రా సీఈవో నందిత సిన్హా తెలిపారు. % ఉత్పత్తుల కొనుగోలు కోసం సమయం వృథా కాకుండా ఎం%-%నౌ సౌకర్యవంతమైన పరిష్కారం అని చెప్పారు. అంతర్జాతీయ, దేశీయ బ్రాండెడ్ లైఫ్‌స్టైల్ ఉత్పత్తులను వినియోగదార్లు కేవలం 30 నిమిషాల్లోనే అందుకోవచ్చని కంపెనీ ప్రకటన తెలిపింది. ఫ్యాషన్, బ్యూటీ, యాక్సెసరీస్, గృహ విభాగంలో 10,000 కంటే ఎక్కువ ఉత్పత్తుల శ్రేణిని ప్రస్తుతం ఎం%-%నౌ లో అందిస్తోంది. 3%-%4 నెలల్లో ఈ సంఖ్యను లక్షకు పైచిలుకు చేర్చనున్నట్టు మింత్రా వెల్లడించింది. నవంబర్‌లో బెంగళూరులో మింత్రా క్విక్ కామర్స్ పైలట్ ప్రాజెక్ట్ నిర్వహించింది. పైలట్ ప్రాజెక్టులో కస్టమర్ల నుంచి సానుకూల స్పందన లభించిందని సిన్హా వ్యాఖ్యానించారు. ఇది ప్రారంభం మాత్రమేనని, మరింతగా విస్తరిస్తామని చెప్పారు. ఇతర క్విక్ కామర్స్ కంపెనీల మాదిరిగా కాకుండా ఉత్పత్తుల మార్పిడి, వెనక్కి ఇచ్చే సౌకర్యం కూడా ఉందని నందిత వెల్లడించారు. కాగా, మెట్రో నగరాల్లో మింత్రా ఎక్స్‌ప్రెస్ డెలివరీ సేవలకు 2022లో శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఆర్డర్ పెట్టిన 24%-%48 గంటల్లో ఉత్పత్తులను డెలివరీ చేస్తోంది.

## వాటి జోలికి వెళ్లొద్దు: సెబీ




న్యూఢిల్లీ: అనామక ఆన్‌లైన్ వేదికల ద్వారా లభించే అన్‌లిస్టెడ్ డెట్ సెక్యూరిటీస్‌తో జాగ్రత్తగా ఉండాలని, వాటికి జోలికి వెళ్లరాదని గురువారం ఇన్వెస్టర్లను మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ హెచ్చరించింది. ఈ అన్‌రిజిస్టర్డ్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై ఎటువంటి నియంత్రణా ఉండదని, మదుపరుల రక్షణ వ్యవస్థ కూడా లేదని ఓ ప్రకటనలో సెబీ పేర్కొన్నది. కంపెనీల చట్టం 2013ను ఉల్లంఘిస్తూ 200లకుపైగా ఇన్వెస్టర్లకు అన్‌లిస్టెడ్ సెక్యూరిటీస్‌ను అక్రమ సంస్థలు ఆఫర్ చేస్తున్నాయని సెబీ గుర్తించింది. ఈ క్రమంలోనే పైవిధంగా మదుపరులను అప్రమత్తం చేసింది. వీటిలో పెట్టుబడులు పెడితే చాలా ప్రమాదమని గుర్తుచేసింది. కాగా, లిస్టెడ్ డెట్ సెక్యూరిటీల్లో పెట్టుబడుల కోసం బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఆథరైజ్డ్ స్టాక్‌బ్రోకర్లు నిర్వహించే రిజిస్టర్డ్ ఆన్‌లైన్ బాండ్ ప్లాట్‌ఫామ్స్‌ల్లోకి మాత్రమే వెళ్లాలని ఈ సందర్భంగా సెబీ సూచించింది. ఇదిలావుంటే గత 30 రోజుల్లో ఎలాంటి లావాదేవీలు జరుపని క్లయింట్స్ ఖాతాల్లోని ఫండ్స్ సెటిల్మెంట్‌కు సెబీ నడుం బిగించింది. 3 పనిదినాల్లో సమస్యను పరిష్కరించేలా స్టాక్ బ్రోకర్లకు సెబీ సూచిస్తున్నది. అలాగే ఈక్విటీ మార్కెట్లలో క్లోజ్ యాక్షన్ సెషన్‌ను సెబీ పరిచయం చేయాలని చూస్తున్నది. దేశంలోని ఈక్విటీ క్యాష్ మార్కెట్‌లో స్టాక్స్ క్లోజింగ్ ధర నిర్ధారణకే దీన్ని ప్రతిపాదిస్తున్నది. ఇక ఎక్స్చేంజీల రిపాజిటరీ ప్లాట్‌ఫామ్‌పై ఐపీవో డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాల్సిందిగా మర్చంట్ బ్యాంకర్లను సెబీ ఆదేశించింది. మరోవైపు ఫిజికల్ సెటిల్మెంట్ తప్పనిసరిగా ఉన్న డెరివేటివ్స్ మార్కెట్‌లో సెటిల్మెంట్ రిస్క్‌లను పరిష్కరించేందుకు ఫ్యూచర్స్‌లోకి ఐటీఎం ఆప్షన్స్ డివాల్వింగ్‌పై ఓ కన్సల్టేషన్ పేపర్‌ను సెబీ ఇచ్చింది.

## ఈసారీ వడ్డీరేట్లు యథాతథం?

**నేడే ఆర్బీఐ ద్రవ్యసమీక్ష**




ముంబై, : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తమ ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాన్ని శుక్రవారం ప్రకటించబోతున్నది. అయితే ఈసారి కూడా కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి రెపో రేటును గరిష్ఠ స్థాయిలోనే సెంట్రల్ బ్యాంక్ ఉంచుతూ వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరోమారు ఈ రేట్ల జోలికి వెళ్లకుండానే ద్రవ్యసమీక్షను ఆర్బీఐ ముగించవచ్చన్న అభిప్రాయాలు అటు బ్యాంకింగ్, ఇటు ఆర్థిక నిపుణుల నుంచి వ్యక్తమవుతున్నాయి. రిటైల్, హెూల్‌సేల్ ద్రవ్యోల్బణాలు బాగా పెరుగడమే ఇందుకు కారణం. అక్టోబర్‌లో ఏకంగా వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 6.21 శాతానికి చేరిన సంగతి విదితమే. కాగా, మిశ్రమ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ని తగ్గించే వీలుందన్న అంచనాలున్నాయి. ఇదే జరిగితే బ్యాంకులకు నిధుల లభ్యత పెరుగుతుంది. ఫలితంగా ఆయా రంగాలకు చౌకగా రుణాలు లభిస్తాయి. వడ్డీరేట్లను తగ్గించకుండా ఈ రకంగా మార్కెట్‌కు ఊరటనివ్వాలని ఆర్బీఐ చూస్తున్నదని చెప్తున్నారు.

**మరో 27 టన్నుల గోల్డ్**

రిజర్వు బ్యాంక్ క్రమంగా బంగారం నిల్వలను పెంచుకుంటున్నది. అక్టోబర్ నెలలో సెంట్రల్ బ్యాంకులు 60 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేయగా, దీంట్లో రిజర్వుబ్యాంక్ అత్యధికంగా 27 టన్నుల గోల్డ్‌ను కొనుగోలు చేసినట్లు వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ తాజాగా వెల్లడించింది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు మొత్తంగా 77 టన్నుల గోల్డ్ కొనుగోలు చేయగా, దీంట్లో సెంట్రల్ బ్యాంక్ 27 టన్నులు కొనుగోలు చేసినట్లు ఐఎంఎఫ్ విడుదల చేసిన నివేదిక ఆధారంగా డబ్ల్యూజీసీ ఈ విషయాన్ని వెల్లడించింది.

క్రైమ్ మిర్రర్
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
93934 46188

# పుష్పపై నెగటివ్ ప్రచారం

## వార్నింగ్ ఇచ్చిన మైత్రీ టీం



అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతున్న విషయం తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం మొదటిరోజు నుంచే సూపర్ కలెక్షన్లు రాబడుతూ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. అయితే సోషల్ మీడియాలో ఈ సినిమాపై నెగటివ్ ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. కొందరూ వ్యక్తులు వారి సొంత క్రియేటీవిటితో పుట్టించిన కొన్ని డైలాగులను పుష్ప 2 సినిమాలోనివి అని ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ వార్తలపై తాజాగా నిర్మాణ సంస్థ స్పందిస్తూ. ఇలాంటి పనులు చేస్తున్నవారికి వార్నింగ్ ఇచ్చింది. ఊహాజనితమైన, సొంత క్రియేటీవిటితో పుట్టించిన కొన్ని డైలాగులు పుష్ప-2 చిత్రంలోనివి అంటూ కొంత మంది కావాలని సోషల్ మీడియా లో పోస్ట్ చేస్తున్నారు. వాంటెడ్ గా కొంత మంది సినిమాపై నెగటివ్ ప్రచారం కోసం కావాలని ఇలాంటివి పోస్ట్ చేస్తున్నారు. దయచేసి ఇప్పటికైనా ఇలాంటి పోస్టులు పోస్ట్ చెయ్యటం మానుకోకపోతే అలాంటి వారిపై చట్ట పరమైన యాక్షన్ తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నాం. అంటూ మైత్రి మూవీ మేకర్స్ ట్విట్టర్ వేదికగా రాసుకొచ్చింది. ఊహాజనితమైన, సొంత క్రియేటీవిటితో పుట్టించిన కొన్ని డైలాగులు పుష్ప-2 చిత్రంలోనివి అంటూ కొంత మంది కావాలని సోషల్ మీడియా లో పోస్ట్ చేస్తున్నారు. వాంటెడ్ గా కొంత మంది సినిమాపై నెగటివ్ ప్రచారం కోసం కావాలని ఇలాంటివి పోస్ట్ చేస్తున్నారు. దయచేసి ఇప్పటికైనా ఇలాంటి పోస్టులు పోస్ట్ చెయ్యటం మానేయండి అని సూచించింది.



# సాయిపల్లవితో నటించాలంటే భయం : చైతన్య

టాలీవుడ్ అగ్ర కథానాయికలలో సాయిపల్లవి ఒకరు. భానుమతి హైబ్రిడ్ పిల్లా అంటూ ఫిదా సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి మొదటి సినిమాతోనే కుర్రకారు మనసులను దోచుకుంది ఈ భామ. అనంతరం మిడిల్ క్లాస్ అబ్బాయి, పడి పడి లేచే మనసు, లవ్ స్టోరీ, శ్యామ్ సింగరాయ్, విరాట పర్వం తదితర చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ భామ. ప్రస్తుతం నాగ చైతన్యతో తండేల్ అనే సినిమాలో నటిస్తుంది. అయితే రీసెంట్‌గా ఒక టాక్ షోలో పాల్గోన్న నాగ చైతన్య సాయి పల్లవి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దగ్గుబాటి హెూస్ట్‌గా చేస్తున్న టాక్ షో ది రానా దగ్గుబాటి షో. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతున్న ఈ షోలో రీసెంట్‌గా నాగ చైతన్య గెస్ట్‌గా వచ్చాడు. అయితే షోలో భాగంగా రానా సాయి పల్లవి గురించి అడుగగా.. చైతూ మాట్లాడుతూ.. సాయిపల్లవితో నటించాలి అన్న.. డాన్స్ చేయాలన్న భయం వచ్చేస్తది బావ (రానా). నువ్వు సాయిపల్లవితో విరాట పర్వం సినిమా చేసి ఒక్క సాంగ్ కూడా పెట్టకుండా భలే తప్పించుకున్నావు. కానీ నాకు అలా లేదు తనతో చేసేటప్పుడు నేను బానే చేస్తున్నానా అని సందేహం వస్తుంది అంటూ నాగ చైతన్య చెప్పుకోచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# పుష్ప.2కు అండగా నిలిచన జాన్వీకపూర్

అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమాకు హాలీవుడ్ చిత్రం ఇంటర్‌స్టెల్లార్ సినిమాకు సంబంధించి ఉత్తరాదిలో వివాదం నడుస్తున్న విషయం తెలిసిందే. హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలాన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం ఇంటర్‌స్టెల్లార్. 2014లో విడుదలైన ఈ చిత్రం హాలీవుడ్‌లోనే కాకుండా ఇండియాలోను మంచి కలెక్షన్లు సాధించింది. అయితే ఈ సినిమా 10 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మేకర్స్ రీ రిలీజ్ ప్లాన్ చేశారు. ఈ సినిమాను ఐమాక్స్ వెర్షన్ మాత్రమే రిలీజ్ చేయనుండగా.. ఇండియాలో కాకుండా వరల్డ్ వైడ్‌గా విడుదల చేస్తుంది చిత్రబృందం. దీనికి ముఖ్య కారణం ఇండియాన్ ఐమాక్స్‌ల్లో 'పుష్ప 2' ఉండటం. దీంతో ఇండియన్స్‌కు అసలు సినిమాలు చూడడం రాదని.. సైన్స్ ఫిక్షన్ వదిలేసి మాస్ సినిమాలకు ఎంకరేజ్ చేస్తున్నారని కొందరూ కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ వివాదంపై బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ స్పందిస్తూ.. 'పుష్ప2' సినిమాకు మద్దతుగా నిలిచింది. జాన్వీ మాట్లాడుతూ.. 'పుష్ప 2' కూడా ఒక సినిమానే కదా.. ఇంటర్‌స్టెల్లార్ సినిమాతో ఈ సినిమాను పోలుస్తూ ఎందుకు తక్కువ చేస్తున్నారు. ఏ హాలీవుడ్ సినిమాను మీరు సపోర్ట్ చేస్తున్నారో వాళ్లే ఇప్పుడు ఇండియన్ సినిమాల గురించి చర్చించుకుంటున్నారు.. ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ మనం మాత్రం మన సినిమాలను తక్కువ చేసుకుంటూ మనల్ని మనమే అవమానించుకుంటూ ఉండిపోతున్నాం. ఇలాంటివి చూసినప్పుడు బాధగా ఉంటుంది అంటూ జాన్వీ రాసుకోచ్చింది. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్ట్ వైరల్‌గా మారింది.





# చిరంజీవి విశ్వంభరా ఆరోజైనా..?



చిరంజీవి 'విశ్వంభర' సినిమా కోసం మెగా అభిమానులంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. నిజానికి ఈ సినిమా సంక్రాంతికి రావాల్సింది. కానీ 'గేమ్ చేంజర్' సంక్రాంతికి వస్తుండటంతో 'విశ్వంభర'ని వాయిదా వేయాల్సొచ్చింది. ఇటీవలే చిత్రీకరణ పూర్తిచేశారు. రిలీజ్ డేట్‌ని మాత్రం మేకర్స్ ప్రకటించలేదు. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను ఏప్రిల్ 10న విడుదల చేయడానికి నిర్మాతలు వి.రామకృష్ణారెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్‌రెడ్డిలు సన్నాహాలు చేస్తున్నారట. ఇదిలావుంటే.. అటు ఇటుగా అదేటైమ్‌లో ప్రభాస్ 'రాజా సాబ్' సినిమా కూడా విడుదలకు సిద్ధమవున్నది. ఏప్రిల్ రెండోవారంలో 'రాజా సాబ్' రిలీజ్ కానున్నట్లు గతంలోనే చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే.. ప్రభాస్ అనుబంధ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న 'విశ్వంభర'కు పోటీగా, ప్రభాస్ 'రాజా సాబ్' రావడం జరిగే పని కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏమవుతుందో చూడాలి. ఇదిలావుండగా ఇటీవలే చిరంజీవి కొత్త సినిమా ప్రకటన వెలువడిన విషయం తెలిసిందే. యువ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించనున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం.

# అమీర్‌ఖాన్ తనయుడితో సాయిపల్లవి ప్రేమాకథ

దక్షిణాదిలో తిరుగులేని గుర్తింపును సంపాదించుకున్న అగ్ర కథానాయిక సాయిపల్లవి ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి పెడుతున్నది. 'రామాయణ' చిత్రం ద్వారా ఆమె హిందీ చిత్రసీమలోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో పాటు అమీర్‌ఖాన్ తనయుడు జునైద్‌ఖాన్‌తో కలిసి ఓ ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నది. అమీర్‌ఖాన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు సునీల్‌పాండే దర్శకుడు. ఈ చిత్రానికి 'ఏక్ దిన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని అమీర్‌ఖాన్ స్వయంగా వెల్లడించారు. హృద్యమైన ప్రేమకథాంశమిదని, ఈ సినిమాతో సాయిపల్లవి ఉత్తరాది యువతకు చేరువవుతుందని చిత్రబృందం పేర్కొంది. ఇదిలావుండగా ఇటీవల విడుదలైన 'అమరన్' చిత్రంలో సాయిపల్లవి అద్భుతాభినయానికి సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ సినిమా బాలీవుడ్‌లో కూడా హిట్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో సాయిపల్లవి హిందీ సినిమాల తాలూకు అప్‌డేట్స్‌పై అక్కడి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# ఇంకేప్పుడు నటించొద్దు అన్నారు..? : రష్మిక

'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో అభినందనలు అందుకుంటున్న అందాల రష్మిక.. తన తాజా ఇంటర్వ్యూ ద్వారా ఆనందాన్ని వ్యక్తంచేస్తూ.. పలు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. "శ్రీవల్లి' లాంటి పాత్ర చేసినందుకు నన్నందరూ మంచి నటి అని మెచ్చుకుంటున్నారు. కానీ నా స్కూల్ టైమ్‌లో ఓసారి స్టేజ్ షో చేశా. అది ఎవరికీ నచ్చలేదు. కొందరైతే.. 'ఇంకెప్పుడూ నటించకు' అని ఉచిత సలహా కూడా పారేశారు' అంటూ అందంగా నవ్వేసింది రష్మిక. ఇంకా చెబుతూ 'పదిమందిలో ఉన్నప్పుడు అక్కడ నన్నెవరూ నవ్వుతూ పలకరించకపోతే.. ఆ ప్రదేశంలో నేనుండలేను. అది నా బలహీనత. అంతేకాదు, కొన్ని రూమర్ల వల్ల కూడా కన్నీరు పెట్టుకున్న సందర్భాలున్నాయి. నా రెమ్యునరేషన్ గురించి ఏవేవో రాశారు. నిజానికి డబ్బు గురించి అస్సలు పట్టించుకోను. తొలి సినిమాకు తీసుకున్న పారితోషికం కేవలం రెండున్నర లక్షలు. నాకు క్యారెక్టర్ ముఖ్యం. అయితే.. డబ్బు తక్కువ ఇచ్చినా పర్లేదు కానీ.. ఫ్రీగా మాత్రం చేయకూడదనేది నా పాలసీ' అని చెప్పారు 'ఓ మంచి బయోపిక్‌లో నటించాలి. అలాగే.. 'బాహుబలి'లో దేవసేన లాంటి పాత్ర చేయాలి. ఈ రెండు కోరికలు ఎప్పుడు తీరతాయా అని ఎదురు చూస్తున్నా' అని తెలిపారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.